క్లుప్తంగా

మదర్ డెయిరీ కందుకూరు అధ్యక్షుడిగా సంజీవరెడ్డి



సంజీవరెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

కందుకూరు: కందుకూరు గ్రామ మదర్ డెయిరీ అధ్యక్షుడిగా టంకరి సంజీవరెడ్డి వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆ సంస్థ ఎన్నికల అధికారి తాళ్ల లింగం ఆధ్వర్యంలో మదర్ డెయిరీ గ్రామ కమిటీని ఎన్నుకొని ప్రకటించారు. అనంతరం నూతన సభ్యులకు ఆయన నియామకపత్రం అందించారు. డైరెక్టర్లుగా గుండ్ర జ్యోతి, బొద్దం యాదగిరిరెడ్డి, ఉమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, కొమ్మగల్ల యాదయ్య, ఎడ్ల జనాలును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గుండ్ర సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా దేవేందర్‌గౌడ్

మహేశ్వరం: సీపీఐ మండల కార్యదర్శిగా దేవేందర్‌గౌడ్‌ను నియమించినట్లు నియోజకవర్గ కార్యదర్శి బి.దత్తునాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల మహేశ్వరం మండల కేంద్రంలో జరిగిన పార్టీ మహాసభలో కార్యదర్శిగా దేవేందర్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా బ్రహ్మచారితో పాటు 21 మంది కౌన్సిల్ సభ్యులు, 9 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి మాట్లాడుతూ.. గ్రామాల్లో పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ జిల్లా కార్యదర్శి జంగయ్య, నియోజకవర్గ కార్యదర్శి దత్తునాయక్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా మలుపు



సూచికబోర్డు లేని మలుపు

కొత్తూరు: ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లపై ఉన్న మూల మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయపడుతున్నారు. అయినప్పటికీ అధికారులు మండలంలో ప్రమాదకరంగా మారిన మలుపులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. పెంజర్ల నుంచి సిద్ధాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఎదురుగా ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదాలకు గురవుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మైసమ్మ సన్నిధిలో మాజీ ఎంపీ



అమ్మవారిని దర్శించుకున్న మధుయాష్కీగౌడ్

కడ్తాల్: మండల పరిధి మైసిగండి మైసమ్మ అమ్మవారిని ఆదివారం కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మధుయాష్కిని పూలమాల శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలి, నాయకులు దుర్గారెడ్డి, అర్చక సిబ్బంది చంద్రయ్య, కృష్ణయ్య, యాదగిరి, బాలబ్రహ్మచారి తదితరులు ఉన్నారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.25, వంకాయ రూ.28, బెండ రూ.55, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.37, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.26, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, కీర రూ.40, బీన్స్ రూ.85, క్యాప్సికమ్ రూ.60. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

సమస్యలకు ఆలవాలం

- కనీస సౌకర్యాలు కరువు
- డ్రైనేజీ, రోడ్లకు నోచుకోని మామిడిపల్లి వేంకటేశ్వర కాలనీ

పహాడీషరీఫ్: మౌలిక సదుపాయాలు కల్పించాలని శ్రీ వేంకటేశ్వర కాలనీ ప్రజలు కోరుతున్నారు. డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పార్కు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. బడంగ్‌పేట మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధి మామిడిపల్లి వేంకటేశ్వర కాలనీలో హెచ్‌ఎండీఏ అనుమతులు లేకుండా గతంలో ఓ వెంచర్ ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ విమానాశ్రయం పక్కనే ఉండటంతో ఇక్కడ చాలామంది ప్లాట్లను కొనుగోలు చేశారు. నివాసాలు వెలుస్తున్నాయి. కానీ కనీస సదుపాయాలు లేని కారణంగా చాలామంది ఇళ్లు కట్టుకునేందుకు సాహసించడం లేదు. నివాసం ఏర్పర్చుకున్న వారు.. నివసించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.



మామిడిపల్లి వేంకటేశ్వర కాలనీ

ఇళ్ల మధ్యే మురుగు

రియల్ వ్యాపారులు కొందరు.. మామిడిపల్లిలో పొలాలను కొనుగోలు చేశారు. రాళ్లు పాతి విక్రయించి చేతులు దులుపుకొన్నారు. డ్రైనేజీ పైప్ లైన్లు, అవుట్‌లెట్ లేని కారణంగా.. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీరు ఈ ప్లాట్ల నడుమ పారుతోంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించినా..

అనధికారిక లేఅవుట్‌గా ఉన్న ఈ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు.. రెండు నెలల క్రితం చాలా మంది ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించారు. ఒక్కొక్కరు లక్ష వరకు చెల్లించినా.. పుర అధికారులు తమ కాలనీలో సదుపాయాలు కల్పించడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి వసతులు కల్పించాలని కోరుతున్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

మున్సిపల్ కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: మహిళలు, గ్రూపు సంఘాల సభ్యులు స్వశక్తితో ఎదగాలని మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మెప్మా గ్రూపు సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. 502 సంఘాల లక్ష్యం ఉన్నప్పటికీ ఇప్పటి వరకు 193 సంఘాలకు బ్యాంక్ లింకేజీ ఏర్పాటు చేశామన్నారు. లింకేజీ ద్వారా ఏర్పడిన సంఘాలను గుర్తించి రుణాలను అందిస్తున్నామని స్పష్టం చేశారు.



మహిళా సంఘాలతో కమిషనర్ సరస్వతి

బ్యాంక్ లింకేజీ ద్వారా వీధి వ్యాపారాలను ప్రోత్సహించేందుకు శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారం జిల్లా పరిషత్ పాఠశాలలో 1984–85 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం హైదరాబాద్ కర్మాన్‌ఘాట్‌లో గల శుభం కన్వెన్షన్‌లో సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 40 ఏళ్ల తర్వాత వారందరూ ఒకచోట చేరి చిన్ననాటి తీపి జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను నెమరువేసుకొని సంతోషంగా గడిపారు. ఎవరెవరూ ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో ఒకరిని ఒకరు అడిగి తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు కేశవులు, సదానందం, రమాదేవి తదితరులను ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పున్న భిక్షపతి, జేబీ లక్ష్మయ్య, జ్ఞానేశ్వర్, కృష్ణ, రమేశ్, చెన్నయ్యచారి, గోపాల్, పద్మ, అరుణ, విజయలక్ష్మీ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

వంగూరి యాదవరెడ్డికి డాక్టరేట్



యాదవరెడ్డిని సన్మానిస్తున్న దేపభాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన ప్రముఖ హ్యూమనిస్ట్ వంగూరి యాదవరెడ్డి ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి నివాసానికి ఆదివారం యాదవరెడ్డి రాగా ఆయనను సన్మానించారు. నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏషియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి అకాడమీ అధినేత చెన్నారెడ్డి చేతుల మీదుగా యాదవరెడ్డి డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. వంగూరి యాదవ రెడ్డి సేవా దృక్పథం, ప్రజల పట్ల నిబద్ధత, విలువలతో కూడిన జీవనశైలి ఆయనను ఈ గౌరవానికి అర్హుడిగా చేశాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, వెంకటేష్ గుప్తా, సురేష్, తలాటి రమేష్ నేత, రామకృష్ణ గౌడ్, లింగస్వామి గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు క్రిస్టియన్ అసోసియేషన్ సమావేశం

మలక్‌పేట: ఈస్ట్ హైదరాబాద్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న మలక్‌పేట రాక్‌చర్చిలో పాస్టర్స్, క్రిస్టియన్ లీడర్స్ సమావేశం జరుగుతుందని జనరల్ సెక్రటరీ జి.సాల్మన్‌రాజ్ తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ బోడా సాల్మన్, ఏపీ హైకోర్టు అడ్వకేట్ బ్రదర్ టీ. ప్రభుదాస్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగే సమావేశంలో భారీ సంఖ్యలో హాజరవ్వాలన్నారు.

సంస్కృతి, ప్రకృతిని కాపాడుకోవాలి

నాగోలు: మన సంస్కృతి, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా జై గణేష్ భక్తి సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయరంగా పేర్కొన్నారు. హిందూ పండుగలను ప్లాస్టిక్ రహిత, పర్యావరణ హితంగా జరుపుకోవాలన్నారు. జై గణేష్ భక్తి సమితి ఆధ్వర్యంలో కొత్తపేటలో డాక్టర్ విజయరంగ అధ్యక్షతన ఆదివారం జై గణేష్ ఉత్సవ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జై గణేష్ భక్తి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జైన్‌కుమార్, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, సాయిబాబా ఆలయ కమిటీ సలహాదారులు వనం యాదయ్యతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మట్టి వినాయక విగ్రహాలు పెట్టాలని, ప్లాస్టిక్ నివారణ, కాలనీల్లో పండ్ల మొక్కలు పెంచడం మా సంస్థ ముఖ్య లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జంగయ్య యాదవ్, వరప్రసాద్, సురేందర్, కృష్ణ, మోహన్‌రెడ్డి, కర్ణ శ్రీనివాస్‌రావు, కొత్తపేట రేణుకుంట శ్రీనివాస్, కందుకూరి శ్రీనివాస్, కోటిరెడ్డి పాల్గొన్నారు.

రథయాత్రలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



రథయాత్రలో పాల్గొన్న లింగాల హరిగౌడ్, లెనిన్ బాబు

సైదాబాద్: భక్తిశ్రద్ధలతో నిర్వహించే దైవకార్యాలు అందరిలో ఐకమత్యాన్ని కలిగిస్తాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆస్మాన్‌గఢ్ చౌరస్తా నుంచి సైదాబాద్ కాలనీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో ఆయన పాల్గొన్నారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై దేవతా మూర్తులను ఉంచి భక్తిపారవశ్యంతో అందరూ రథాన్ని లాగారు. అందరూ భక్తి గీతాలు ఆలపిస్తూ సాగిన రథయాత్రతో సైదాబాద్ పురవీధులలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా హరిగౌడ్ మాట్లాడుతూ.. జగన్నాథుడి రథయాత్ర ప్రపంచ ప్రసిద్ధిని గాంచిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు లెనిన బాబు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల రోడ్లు అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ధ్వంసమైన రోడ్ల గురించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదని ఆయా కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఏర్పడి గుంతలతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలో రోడ్లపై భారీ గుంతలు ఏర్పడటంతో వర్షం వచ్చినప్పుడు నీరు గుంతల్లో నిండి కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వనస్థలిపురంలోని మీ సేవాకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని స్థానికులు వాపోతున్నారు.

మరమ్మతు చేపట్టాలి

అధికారులు తమ కమిషన్ల కోసం వేసిన రోడ్లనే మళ్లీ మళ్లీ వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దశాబ్ద కాలం కింద వేసిన రోడ్ల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. బాగున్న రోడ్లనే అభివృద్ధి పనుల పేరుతో ఏడాది రెండు సార్లు తవ్వి వేస్తున్నారని..అంతర్గత రోడ్లను పట్టించుకోకపోవడంపై మండిపడుతున్నారు. ధ్వంసమైన రోడ్లపై రాకపోకలు సాగించే దుస్థితి లేదని వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే పలు చోట్ల స్థానికులు పైప్‌లైన్ల కోసం తవ్వి వదిలేస్తున్నారని కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గుంతలుగా మారిన వనస్థలిపురం మీసేవకు వెళ్లే దారి

పరామర్శ

కేశంపేట: ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబాల్‌నాయక్ తండ్రి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ శివారులోని పోడగుట్టతండాలో రాంబాల్‌నాయక్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా గోప్య నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించిన అనంతరం రాంబాల్‌నాయక్‌తో పాటుగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, అల వేంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎల్గనమోని రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గోప్యనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు

చినుకు రాలదు.. చింత తీరదు

- ముఖం చాటేసిన వరుణుడు
- మొలకదశలో ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు



తిమ్మారెడ్డిగూడలో ఎండుముఖం పట్టిన పత్తి మొలకలు

షాబాద్: రోహిని కార్తెలో కురిసిన తొలకరికి మండలంలోని తిమ్మారెడ్డిగూడ, తాళ్లపల్లి, తిర్మలాపూర్ తదితర గ్రామాలకల రైతులు పత్తి విత్తనాలు వేశారు. నల్లరేగడి భూములు కావడంతో మొలకెత్తాయి. కానీ వరుణుడు ముఖం చాటేయడంతో అవి ఎండిపోతున్నాయి. ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టామని, ఇంకా వర్షాలు పడకపోతే అప్పుల పాలవుతామని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోటి ఆశలతో వానాకాలం సీజన్ సాగును ప్రారంభించిన వారికి.. చినుకు రాలకపోవడంతో నిరాశే ఎదురైంది. ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా.. పలు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన చిరుజల్లులకు కర్షకులు పలు రకాల విత్తనాలు విత్తుకున్నారు. నాటి నుంచి ఒక్క వాన పడకపోవడంతో అవి మొలకెత్తలేదు. అక్కడక్కడా మొలకెత్తినవి కూడా ఎండిపోతున్నాయి. దీంతో రైతులు వాటిని కాపాడుకునేందుకు రైతులు భగీరథ యత్నం చేస్తున్నారు.

కప్పతల్లి ఆటలు

చేవెళ్ల: వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని వేడుకుంటూ గ్రామస్తులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, కప్పతల్లి ఆటలు నిర్వహించారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో ఆదివారం మహిళలు గ్రామ దేవతలకు పూజలు చేసి, కప్పకావడి ఆటలు ఆడారు. కప్పను రోకలికి కట్టి పసుపు, కుంకుమలతో అలంకరించి ఇంటింటికీ తిరుగుతూ వర్షాలు కురవాలి.. వానదేవుడా కరుణించూ అంటూ పాటలు పాడుకుంటూ పూజలు చేశారు.

ఎమర్జెన్సీ పాలన ప్రజలకు తెలిపేందుకే సదస్సులు

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

హస్తినాపురం: ఇందిరాగాంధీ ప్రధానిగా ఉండి ఎమర్జెన్సీ విధించి నిరంకుశపాలన కొనసాగించారని ఎమర్జెన్సీ పెట్టి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పాలన గురించి ప్రజలకు తెలిపేందుకే సదస్సులు నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి హస్తినాపురంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. అటల్ బిహారి వాజ్‌పేయి, రాజ్‌నాథ్‌సింగ్, నరేంద్రమోదీ, ఎంతో మంది నాయకులు ఆర్‌ఎస్‌ఎస్, జనశక్తి కార్యకర్తలు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడారన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న ఏ ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ఇవ్వలేదని నరేంద్రమోదీ ప్రభుత్వం బాబాసాహెబ్ అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ చేసింది భారత్ జోడోయాత్ర కాదని, అది భారత్ తోడో యాత్ర అని ఎద్దేవా చేశారు. విశ్వామిత్ర, విద్యాన్‌రెడ్డి, సుకుమార్, భూపతిరెడ్డి, సామరంగారెడ్డి, నర్సింహారెడ్డి, లచ్చిరెడ్డి, ఎరుకల మల్లేశ్‌గౌడ్, నరేశ్‌యాదవ్, దెంది రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీసీలు ఐక్యతగా ఉండాలి

మంచాల: బీసీలంతా ఐక్యతగా ఉండాలని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గడ్డం నర్సింహా గౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు ఐక్యతగా లేక పోవడం వలనే రాజ్యాధికారానికి దూరమవుతున్నామని తెలిపారు. ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి, రాజ్యాధికార దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జనాభా ప్రకారం అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇరుకుదారి.. ఇబ్బందిగా మారి..

రహదారుల్లో అక్రమ పార్కింగ్

- సెట్ బ్యాక్ లేకుండా భారీ భవనాల నిర్మాణాలు
- కుంచించుకుపోతున్న రహదారులు
- రాకపోకలకు ఇబ్బందులు



దుర్గాభవానీనగర్ భాష్యం స్కూల్ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా అక్రమ పార్కింగ్

చంపాపేట: అసలే ఇరుకు రహదారులు..ఆపై రోడ్ల ఆక్రమణలు..దానికి తోడు అక్రమ వాహనాల పార్కింగ్‌లు, సెట్ బ్యాక్ నిబంధనలు తుంగలో తొక్కి బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు...వెరసి చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీవాసుల నిత్యం రద్దీతో ఉన్న రహదారులపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చంపాపేట పాతబస్తీలో సుల్తానాఅల్వా, కటకోని కుంట, నెహ్రూనగర్, రెడ్డి బస్తీ, మహంకాళమ్మతోట, హరిజన బస్తీ, కర్మన్‌ఘాట్ ప్రాంతంలోని శుభోదయ, కుమ్మరి బస్తీ వంటి పలు కాలనీలలో ప్రధాన రహదారులన్నీ 10 నుంచి 15, 20 అడుగుల వెడల్పుతో ఇరుకైన రహదారుల మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం ఆయా కాలనీలలో సెట్ బ్యాక్ నిబంధనలు లేని నూతన బహుళ అంతస్తు భవనాలే లెక్కకు మించి ఉన్నాయి. దుర్గాభవానీనగర్, మారుతీనగర్, యాదగిరినగర్ వంటి పలు కాలనీలు సంతోషనగర్ ప్రధాన రహదారికి సమీపంలో ఉండటంతో ఆయా కాలనీవాసులు తమ భవనాలను హాస్టళ్లకు అద్దెకు ఇవ్వటంతో రాత్రింబవళ్లు ఆయా కాలనీల రహదారుల ఇరుపక్కల వాహనాల పార్కింగ్, విద్యార్థుల రాకపోకలతో ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతోంది.

ట్రాఫిక్‌జామ్‌లో అంబులెన్స్

ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయా కాలనీ రహదారుల మీదుగా ప్రయాణించటం నరకం చూడాల్సిందే అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల క్రితం అనారోగ్యంతో ఉన్న రోగిని అంబులెన్స్‌లో డీఎంఆర్‌ఎల్ చౌరస్తాలోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా దుర్గాభవానీనగర్ కాలనీలోని భాష్యం స్కూల్ పాఠశాల వద్ద అక్రమ పార్కింగ్‌తో రెండు గంటల పాటు ఇరుక్కున్న అంబులెన్స్‌లోని రోగి ఆరోగ్య పరిస్థితి మరింత విషమించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సెట్‌బ్యాక్, బహుళ అంతస్తుల భవనాల చుట్టూ విశాలమైన ఖాళీ స్థలం లేని ఇరుకైన భవనాలలో హాస్టళ్లు ఏర్పాటు చేస్తున్నారని అలాంటి భవనాల్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే ఫైర్ ఇంజిన్ వెళ్లేందుకు కూడా మార్గం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట ఇలా..

రోడ్లపై వ్యాపారాలతో..

అసలే ఇరుకైన రహదారిపై ఇరువైపులా అక్రమ పార్కింగ్ ఇది చాలదన్నట్లు వాహనాల ముందు ఉన్న రోడ్డునూ ఆక్రమించి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టీ స్టాల్స్, కూరగాయల దుకాణాలు, పండ్ల తోపుడు బండ్లు ఏర్పాటు చేస్తుండటంతో ఆయా కాలనీలలో నడకే నరకప్రాయంగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంపాపేట చౌరస్తాలో మూడు దశాబ్దాల క్రితం పురాతన భవనంలో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చే వారు తమ వాహనాలను నడిరోడ్డుపై పార్కింగ్ చేస్తుండటంతో అటుగా రాకపోకలు సాగించే వారు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి అక్రమ పార్కింగ్‌పై దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

అడుగు పెట్టలేని దుస్థితి



చంపాపేట పరిధి మారుతీనగర్, యాదగిరినగర్, దుర్గాభవానీనగర్ కాలనీలు గతంలో ప్రశాంతంగా ఉండేవి. కొందరు అద్దెలకు ఆశపడి సెట్ బ్యాక్ లేకుండా బహుళ అంతస్తులు నిర్మించి హాస్టళ్లు, భారీ వ్యాపార కేంద్రాలు, గోదాములకు అద్దెకు ఇస్తున్నారు. వాళ్ల వాహనాలు రోడ్లపై పార్కింగ్‌లు చేస్తుండటంతో కాలనీలోకి అడుగు పెట్టలేని దుస్థితి ఏర్పడింది.

–చందు యాదవ్, సాయిరాంనగర్

ఫిర్యాదు చేసినా స్పందన కరువు



సుల్తానాఅల్వా కాలనీ అంతర్గత రహదారులన్నీ 10, 15 అడుగుల వెడల్పుతో ఉన్నాయి. కాలనీలోని ఇళ్ల నిర్మాణదారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఇరుకైన రహదారులు కాస్తా మరింత ఇరుకుగా మారుతున్నాయి. కనీసం కొన్ని రహదారులలో ఆటో కూడా వెళ్లలేని దుస్థితి ఉంటుంది. ఈ విషయంపై పలుమార్లు సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.

–దొబ్బ శ్రీనివాస్, సుల్తానాఅల్వా కాలనీ